క్లుప్తంగా

అంగన్‌వాడీల నిరసన



మధిర: ఒంటికాలిపై నిల్చుని నిరసన తెలుపుతున్న అంగన్‌వాడీ టీచర్లు

మధిర: సమస్యలు పరిష్కరించాలని కోరుతూ అంగన్‌వాడీ ఉద్యోగులు శుక్రవారం స్థానిక తహసీల్ ఎదుట ఒంటి కాలిపై నిల్చుని నిరసన తెలిపారు. ఈ సందర్భంగా అంగన్‌డీ మధిర ప్రాజెక్టు నాయకురాలు చావా పద్మ, విజయలక్ష్మి తదితరులు మాట్లాడారు. అంగన్‌వాడీ ఉద్యోగులను పర్మినెంట్ చేయాలని, కనీస వేతన చట్టం అమలు చేయాలని, అదనపు పనికి వేతనం ఇవ్వాలని కోరారు. పని భారాన్ని తగ్గించాలని, రాజకీయ ఒత్తిళ్లను నివారించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షులు శీలం నరసింహారావు, పడకంటి మురళి, వడ్రాణపు మధు, తేలప్రోలు రాధాకృష్ణ, అంగన్‌వాడీలు, మినీ వర్కర్లు పాల్గొన్నారు.

పోషకాహారం తీసుకోండి



చంద్రయపాలెంలో ర్యాలీ నిర్వహిస్తున్న సిబ్బంది, బాలింతలు, చిన్నారులు

సత్తుపల్లిరూరల్: పోషకాహార మాసోత్సవాల్లో భాగంగా శుక్రవారం మండల పరిధిలోని చంద్రాయపాలెంలో ఐసీడీఎస్ సూపర్‌వైజర్ రమాదేవి ఆధ్వర్యంలో అవగాహన కార్యక్రమాలు నిర్వహించారు. ఈ సందర్భంగా ర్యాలీ నిర్వహించి పోషకాహార ప్రాముఖ్యతను వివరించారు. ఈ కార్యక్రమంలో అంగన్‌వాడీ టీచర్లు, గర్భిణులు, బాలింతలు పాల్గొన్నారు.

సత్తుపల్లి టిక్కెట్ ఇవ్వండి..



కేసీ వేణుగోపాల్‌కు వివరిస్తున్న టీపీసీసీ మాజీ కార్యదర్శి సోమచంద్రశేఖర్

సత్తుపల్లి: ఖమ్మం జిల్లాలో అత్యధికంగా మాదిగ సామాజిక వర్గం ఉన్నందున ఆ వర్గానికి చెందిన తనకు సత్తుపల్లి అసెంబ్లీ టిక్కెట్ కేటాయించాలని ఏఐసీసీ జనరల్ సెక్రటరీ కె.సి.వేణుగోపాల్‌ను శుక్రవారం ఢిల్లీలో టీపీసీసీ మాజీ కార్యదర్శి వక్కలగడ్డ సోమచంద్రశేఖర్ కలిసి విజ్ఞప్తి చేశారు. కాంగ్రెస్ పార్టీకి అండగా ఉన్న మాదిగలకు అవకాశం కల్పిస్తే రాష్ట్ర వ్యాప్తంగా మాదిగ సామాజికవర్గం పార్టీ కోసం పని చేస్తుందన్నారు.

ఉచిత వైద్య శిబిరం

మధిరరూరల్: మధిర ప్రభుత్వ ఆస్పత్రిలో ఆయుష్మాన్ భవ ఆధ్వర్యంలో శుక్రవారం ఏర్పాటు చేసిన ఉచిత వైద్య శిబిరాన్ని మున్సిపల్ చైర్ పర్సన్ మొండితోక లత ప్రారంభించారు. కార్యక్రమంలో ఆస్పత్రి సూపరింటెండెంట్ రవికుమార్, సీనియర్ వైద్యుడు అనీల్ కుమార్ పాల్గొన్నారు.

బాలుడికి సైకిల్ వితరణ



బాలుడికి సైకిల్ అందజేస్తున్న సుధారాణి

సత్తుపల్లి: తండ్రిని కోల్పోయిన బాలుడికి సుధా చారిటబుల్ ట్రస్ట్ ఫౌండర్ డాక్టర్ కొనకళ్ల సుధారాణి అండగా నిలిచారు. సత్తుపల్లికి చెందిన చిలకమ్మకు ఇద్దరు పిల్లలు ఉండగా, ఆరేళ్ల క్రితం భర్త చనిపోయాడు. దీంతో ఆమె ఇళ్లలో పనిచేస్తూ పిల్లలను పోషిస్తుండగా, పెద్దకుమారుడు మూడు కిలోమీటర్ల దూరంలోని స్కూల్‌కు వెళ్లేందుకు ఇబ్బంది పడుతున్నారు. దీంతో ఆ కుటుంబానికి శుక్రవారం ఆర్థిక సాయం అందజేసిన సుధారాణి.. బాలుడికి సైకి ల్ సమకూర్చగా వారు కృతజ్ఞతలు తెలిపారు.

యూనిఫాం పంపిణీ



ఆటో డ్రైవర్లకు యూనిఫాం పంపిణీ చేస్తున్న నామా ట్రస్టు సభ్యులు

కొణిజర్ల: ఖమ్మం ఎంపీ నామా నాగేశ్వరరావు ఆర్థిక సాయంతో నామా ముత్తయ్య ట్రస్టు సౌజన్యంతో మండలంలోని చిన్నమునగాల, పాతకాచారం గ్రామాల్లో శుక్రవారం సుమారు 100 మంది ఆటో డ్రైవర్లకు యూనిఫాం పంపిణీ చేశారు. ఈ సందర్భంగా కొణిజర్ల సొసైటీ చైర్మన్ చెరుకుమల్లి రవికుమార్, సర్పంచ్ స్వప్నలు మాట్లాడుతూ.. ఎంపీ నామా పేదల పక్ష పాతి అన్నారు. తండ్రి పేరుతో నామా చేస్తున్న సేవా కార్యక్రమాలు అభినందనీయం అన్నారు. కార్యక్రమంలో ఉపసర్పంచ్ వెంకటేశ్వరరావు, నాయకులు కృష్ణ, రాముడు, నగేష్, సురేష్, నరసింహారావు పాల్గొన్నారు.

పడకేసిన పారిశుద్ధ్యం

- అధ్వానంగా మధిర మున్సిపాలిటీ
- ప్రబలుతున్న సీజనల్ వ్యాధులు
- పట్టించుకోని అధికారులు
- ఆందోళనలో ప్రజలు



సైడ్ కాలువల్లో పెరిగిన పిచ్చి మొక్కలు





హనుమాన్ కాలనీలో అధ్వానంగా ఉన్న రోడ్లు

మధిర: పన్నుల వసూళ్లలో, పారిశుద్ధ్య చర్యల్లో, మరుగుదొడ్ల నిర్మాణంలో గతంలో మధిర మున్సిపాలిటీ ఉత్తమ మున్సిపాలిటీగా ఎంపికైంది. కానీ ప్రస్తుత పరిస్థితుల్లో పారిశుద్ధ్య చర్యలు చేపట్టకపోవడంతో పట్టణం అధ్వానంగా ఉంది. ముఖ్యంగా విలీన గ్రామాలైన ఇల్లెందులపాడు, అంబారుపేట, మడుపల్లి గ్రామాలతో పాటు హనుమాన్ కాలనీ, ఎంప్లాయిస్ కాలనీలో, ఆర్‌సీఎం చర్చి వెనుక రోడ్లు ధ్వంసమయ్యాయి. పట్టణంలో అనేక రోడ్లు సీసీ రోడ్ల నిర్మాణానికి నోచుకోలేదు. హనుమాన్ కాలనీ ఏర్పడి 30 సంవత్సరాలు గడిచినప్పటికీ తట్టెడు మట్టి కూడా పోయని రోడ్లు ఉండటం గమనార్హం.

ముందుకు కదలని మురుగు..

సైడ్ కాలువలు లేకపోవడం, షిల్ట్ తొలగించకపోవడం, కల్వర్టుల నిర్మాణం లేకపోవడంతో మురుగు నీరు ముందుకు కదలడం లేదు. దీంతో దోమలు వృద్ధి చెంది, ప్రజలు విష జ్వరాలతో తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. హనుమాన్ కాలనీలో కనీసం పాదచారులు నడిచేందుకు కూడా రోడ్లు ఇబ్బందికరంగా ఉన్నాయి. డ్రెయినేజీ వ్యవస్థ లేకపోవడంతో ఇళ్లల్లో వాడుకున్న నీరు, వర్షపు నీరు రోడ్లపై నిలబడి గుంతలు తేలాయి. మెయిన్ రోడ్లలో మాత్రమే అప్పుడప్పుడు ఫాగింగ్ చేస్తున్నారని ప్రజలు ఆరోపిస్తున్నారు. మరికొన్ని చోట్ల సైడ్ కాలువలను ఆక్రమించి ఇళ్ల ముంగిట మెట్ల నిర్మాణం చేపట్టడంతో కాలువలు మూసుకుపోయి మురుగు నీరు ముందుకు కదలని పరిస్థితి నెలకొంది.

పేరుకుపోయిన చెత్తా చెదారం..

హనుమాన్ కాలనీకి వెళ్లే బైపాస్ రోడ్డులో, మధిర-వైరా ప్రధాన రహదారి పక్కన, రాయపట్నం, దెందుకూరు వైపు వెళ్లే రహదారులకు ఇరువైపులా చెత్త వేస్తున్నారు. దీంతో పందులు, కుక్కలు ఈ చెత్తాచెదారాన్ని చిందరవందరగా చేస్తుండడంతో దుర్వాసన వెదజల్లుతుంది. ఆయా రహదారుల్లో వెళ్లే ప్రయాణికులు తీవ్ర అసౌకర్యానికి గురవుతున్నారు. కోళ్ల ఫారాల నుంచి వచ్చే వ్యర్థాలు, ఫంక్షన్లలో మిగిలిపోయిన ఆహార పదార్థాలను ప్రధాన రహదారులకు ఇరువైపులా వేస్తుండడంతో పారిశుద్ధ్యం పడకేసింది. ఇంటి పన్నులు, వాటర్ బిల్లులు సకాలంలో వసూలు చేస్తున్నారు కానీ పారిశుద్ధ్య చర్యలు చేపట్టడం లేదని ప్రజలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

ఫాగింగ్ చేయాలి..



హనుమాన్ కాలనీలో ఉన్న అన్ని రోడ్లలో ఫాగింగ్ చేయాలి. సైడ్ కాలువల్లో ఉన్న షిల్టు తొలగించాలి. రోడ్లపైకి నీరు రాకుండా చూడాలి. ఇంటి పన్నులు, వాటర్ బిల్లులు చెల్లిస్తున్నాం కానీ సౌకర్యాలు కల్పించడం లేదు.

– మునుగోటి నరసింహారావు, హనుమాన్ కాలనీ

రోడ్లు నిర్మించాలి..



హనుమాన్ కాలనీలో రోడ్ల మీద నడిచేందుకు కూడా ఇబ్బంది అవుతుంది. తట్టెడు మట్టి కూడా పోయడం లేదు. సైడ్ కాలవలు నిర్మించాలి. సిమెంట్ రోడ్లు వేయాలి. దోమల నివారణకు చర్యలు తీసుకోవాలి.

– మొగిలి లక్ష్మి, హనుమాన్ కాలనీ

ముమ్మరంగా పారిశుద్ధ్య చర్యలు..



మున్సిపాలిటీలోని పారిశుద్ధ్య చర్యలు ముమ్మురంగా చేపడుతున్నాం. సిబ్బంది ఫాగింగ్, యాంటీ లార్వా కార్యక్రమం, గ్రాస్ కటింగ్ చేస్తున్నారు. మురికి గుంటల్లో ఆయిల్ బాల్స్ వేస్తున్నారు. రిసోర్స్ పర్సన్ల ద్వారా అవగాహన కల్పిస్తున్నాం.

– అంబటి రమాదేవి, మున్సిపల్ కమిషనర్, మధిర

మధ్యాహ్న భోజన కార్మికుల నిరసన



సత్తుపల్లిటౌన్: కళ్లకు గంతలతో నిరసన చేస్తున్న మధ్యాహ్న భోజన కార్మికులు

సత్తుపల్లిటౌన్: సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ సత్తుపల్లిలో మధ్యాహ్న భోజన కార్మికులు కళ్లకు గంతలు కట్టుకొని స్థానిక రింగ్‌సెంటర్‌లో శుక్రవారం నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా మధ్యాహ్న భోజన పథకం వర్కర్స్ యూనియన్ రాష్ట్ర కమిటీ సభ్యుడు నిమ్మటూరి రామకృష్ణ మాట్లాడుతూ.. ప్రభుత్వం మధ్యాహ్న భోజన కార్మికులను ఇప్పటికైన గుర్తించి వారి సమస్యలను పరిష్కరించాలని కోరారు. కార్యక్రమంలో రామారావు, బసవయ్య, రహింతుల్లా, లక్ష్మి, వెంకమ్మ, రహీమున్నీసా, వరలక్ష్మి, వెంకటలక్ష్మి, సావిత్రి, సునీత, జరీన పాల్గొన్నారు.

వేంసూరు: పెండిగ్ బిల్లులు, గౌరవ వేతనం ఇవ్వాలని మధ్యాహ్న భోజన కార్మికులు చేపట్టిన సమ్మె శుక్రవారం మూడో రోజుకు చేరింది. నల్ల బ్యాడ్జీలు కట్టుకుని ఒక్క కాలుపై నిలబడి నిరసన తెలిపారు. ప్రభుత్వం పెండింగ్ బిల్లులు, గౌరవ వేతనం ఇచ్చే వరకు సమ్మె చేస్తామని తెలిపారు.

ఉత్తమ ఉపాధ్యాయుడికి సన్మానం



శ్రీనివాసరావును సన్మానిస్తున్న ఉపాధ్యాయులు

కల్లూరు రూరల్: జిల్లా స్థాయిలో ఉత్తమ ఉపాధ్యాయుడిగా ఎంపికై న బానోత్ శ్రీనివాసరావును మండల పరిషత్ కార్యాలయంలో శుక్రవారం ఉపాధ్యాయ సంఘాల ఆధ్వర్యంలో ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా జెడ్పీటీసీ సభ్యుడు కట్టా అజయ్‌కుమార్ మాట్లాడారు. ఈ కార్యక్రమంలో ఎంఈఓ ప్రసాద్, పీఆర్‌టీయూ మండల అధ్యక్షుడు రమేష్, కార్యదర్శి షేక్‌చాంద్ మియా, యూటీఎఫ్ నాయకులు విజయ్, నాగేశ్వరావు, టీపీటీఎఫ్ నాయకుడే నాగు పలువురు ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

తహసీల్దార్‌కు వినతి

తల్లాడ: మండలంలోని నాలుగు సొసైటీల్లో రుణం పొందిన రైతులకు ప్రభుత్వం రుణమాఫీ ఇచ్చినా పలు కొర్రీలు పెడుతూ రైతులను ఇబ్బందులు పెడుతున్నారని బీజేపీ ఆధ్వర్యంలో శుక్రవారం తల్లాడ తహసీల్దార్ రవికుమార్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా జిల్లా కోఆపరేటివ్ కన్వీనర్ బాలాజీ నాయక్, బీజేపీ మండల అధ్యక్షుడు వెంకటరామారావు మాట్లాడుతూ.. ఈ ప్రభుత్వం 2018లో రైతులకు రుణమాఫీ చేస్తానని ప్రకటించి ఇంతవరకు పూర్తి చేయలేదన్నారు. రుణమాఫీ అందజేయకుండా పలు కొర్రీలు పెడుతూ రైతులను బ్యాంకుల చట్టూ తిప్పుతున్నట్లు ఆరోపించారు. కార్యక్రమంలో రైతులు రాగం రామస్వామి, వెల్లంకి వెంకటేశ్వర్లు, బీరెల్లి సామేలు పాల్గొన్నారు.

ఐద్వా పోరాట ఫలితమే మహిళా బిల్లు

సత్తుపల్లిటౌన్: ఎన్నో సంవత్సరాలుగా ఐద్వామహిళా సంఘం చేసిన పోరాటాల ఫలితంగానే మహిళా రిజర్వేషన్ బిల్లు కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిందని ఐద్వా పట్టణ కార్యదర్శి పాకలపాటి ఝాన్సీ అన్నారు. శుక్రవారం సత్తుపల్లిలో జరిగిన మహిళా సదస్సులో మాట్లాడారు. 2025 నుంచి మహిళా రిజర్వేషన్ బిల్లు అమలు చేయకుండా 2023 నుంచే అమలు చేసి ప్రధాని మోదీ ప్రభుత్వం చిత్తశుద్ధిని నిరూపించుకోవాలని డిమాండ్ చేశారు. ఈ సమావేశంలో ఐద్వా నేతలు పుష్ప, ప్రభావతి, ఉదయశ్రీ, కవిత, రామేశ్వరి, నాగేంద్ర, సుశీల, బసవమ్మ పాల్గొన్నారు.

పాలాభిషేకం

సత్తుపల్లిరూరల్: దేశ చరిత్రలోనే మహిళా రిజర్వేషన్ బిల్లు గొప్ప అధ్యాయం అని నంబూరి రామలింగేశ్వరరావు అన్నారు. కేంద్ర ప్రభుత్వం చట్టసభల్లో మహిళలకి 33 శాతం రిజర్వేషన్ బిల్లు పట్ల హర్షం వ్యక్తం చేస్తూ.. మహిళలు శుక్రవారం సత్తుపల్లిలోని అంబేద్కర్ విగ్రహం వద్ద ప్రధాని మోదీ చిత్రపటానికి పాలాభిషేకం చేశారు. కార్యక్రమంలో నియోజకవర్గ కన్వీనర్ భాస్కర్ని వీరంరాజు, రాష్ట్ర కౌన్సిల్ సభ్యుడు మట్టా ప్రసాద్, రూరల్ మండల అధ్యక్షుడు శ్రీనివాస్, నవీన్ పాల్గొన్నారు.

రామారావుకు ఎమ్మెల్యే సండ్ర నివాళి

సత్తుపల్లి: కెప్టెన్ జలగం రామారావు చిత్రపటానికి సత్తుపల్లి ఎమ్మెల్యే సండ్ర వెంకటవీరయ్య శుక్రవారం హైదరాబాద్ జూబ్లీహిల్స్‌లోని జలగం ప్రసాదరావు నివాసంలో పూలమాలలు వేసి నివాళులర్పించారు. కుటుంబ సభ్యులను పరామర్శించారు.

కల్లబొల్లి కబుర్లు మానుకోవాలి

ఏన్కూరు: కవితక్కా కల్లబొల్లి కబుర్లు మానుకోవాలని బీజేపీ రాష్ట్ర కౌన్సిల్ సభ్యుడు కొవ్వూరి నాగేశ్వరావు కోరారు. మండల కేంద్రంలో శుక్రవారం జరిగిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. ఢిల్లీలో గంట ధర్నా చేసి నా మూలంగానే మహిళ బిల్లు అమలులోకి వచ్చిందని అనడం సరైంది కాదన్నారు. ఈ కార్యక్రమంలో బీజేపీ నాయకులు చింతనబోయిన రాందాస్, గుగులోతు శశికిరన్, బిక్షం పాల్గొన్నారు.

తల్లాడ మేజర్ పంచాయతీకి డబుల్ ట్రక్కు

తల్లాడ: తల్లాడ మేజర్ పంచాయతీకి కొనుగోలు చేసిన డబుల్ ట్రక్కును శుక్రవారం సర్పంచ్ పాట్టేటి సంధ్యారాణి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. తల్లాడ పంచాయతీలో తడి, పొడి చెత్తను డంపింగ్ యార్డ్‌కు తరలించేందుకు సింగిల్ ట్రక్కు సరిపోవటం లేదని, దీంతో డబుల్ ట్రక్కును కొనుగోలు చేసినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీఓ కొండపల్లి శ్రీదేవి, ఈఓ ఉమా పాల్గొన్నారు.

సీపీఎం సీనియర్ నాయకుడు మృతి

చింతకాని: మండలంలోని రాఘవాపురం గ్రామానికి చెందిన సీపీఎం సీనియర్ నాయకుడు దొబ్బల వెంకయ్య(85) అనారోగ్యంతో శుక్రవారం మృతి చెందాడు. మృతదేహాన్ని సీపీఎం జిల్లా కార్యదర్శి నున్నా నాగేశ్వరరావు, రాష్ట్ర కమిటీ సభ్యులు పొన్నం వెంకటేశ్వరరావు, నాయకులు మాదినేని రమేష్, మండల కార్యదర్శి మడుపల్లి గోపాలరావు, వత్సవాయి జానికిరాములు, రాచబంటి రాము, మాదినేని రవి, దొబ్బల బాబు, సీపీఐ నాయకుడు కొండపర్తి గోవిందరావు, తదితరులు సందర్శించి నివాళులర్పించారు.

రోడ్డు ప్రమాదంలో ఇరువురికి గాయాలు

మధిరరూరల్: తొర్లపాడు – తొండల గోపవరం క్రాస్ రోడ్డు వద్ద శుక్రవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఇరువురికి గాయాలయ్యాయి. తొర్లపాగుకు చెందిన అంగన్‌వాడీ టీచర్ కాసింబీ, బికార్‌సాహెబ్‌లు ద్విచక్రవాహనంపై వెళుతుండగా ప్రమాదవశాత్తు ఎదురుగా వస్తున్న ట్రాక్టర్‌ను ఢీకొని కిందపడ్డారు. ఈ ఘనటనలో వారిద్దరికీ తీవ్ర గాయాలు అయ్యాయి. చికిత్స నిమిత్తం క్షతగాత్రులను మధిర ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు.


లయన్స్‌క్లబ్ చేయూత



బాలింతకు ఊయల, ఆహారపదార్థాలను అందిస్తున్న లయన్స్ బాధ్యులు

వైరారూరల్: మండలంలోని రెబ్బవరం బీసీ కాలనీలోని చింతల తిరుపతమ్మ అనే బాలింతకు శుక్రవారం లయన్స్ క్లబ్ బాధ్యులు దుప్పట్లు, చీరలు, చిన్నారికి అవసరమైన వాటితో పాటుగా.. బాలింతకు అవసరమైన ఆహార పదార్థాలను అందించారు. లయన్స్ బాధ్యులు నంబూరి మధు, ఉపేంద్రరావు, నాగేశ్వరరావు, హనుమాయమ్మ, అంగన్‌వాడీ టీచర్లు, కె.అన్నపూర్ణ, పి.కోటేశ్వరి, రమాదేవి పాల్గొన్నారు.

పేదరిక నిర్మూలనే కమ్యూనిస్టుల ధ్యేయం



మాట్లాడుతున్న గోకినేపల్లి వెంకటేశ్వర్లు

కారేపల్లి: పేదరిక నిర్మూలనే కమ్యూనిస్టుల ధ్యేయమని సీపీఐ ఎంఎల్ ప్రజాపంథా జిల్లా కార్యదర్శి గోకినేపల్లి వెంకటేశ్వర్లు అన్నారు. శుక్రవారం కారేపల్లి వైఎస్ఎన్ గార్డెన్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఈ నెల 23, 24వ తేదీల్లో కారేపల్లిలో జిల్లా రాజకీయ శిక్షణ తరగతులను నిర్వహించనున్నట్లు, ఈ శిక్షణా తరగతులను మాజీ ఎమ్మెల్యే గుమ్మడి నర్సయ్య, సీపీఐ ఎంఎల్ ప్రజాపంథా రాష్ట్ర కార్యదర్శి పోటు రంగారావులు ప్రారంభించి మాట్లాడుతారన్నారు. దేశంలో, రాష్ట్రంలో పాలకులు ఓటుబ్యాంకు రాజకీయాలకు పాల్పడుతున్నారన్నారు. సమ్మె చేస్తున్న అంగన్‌వాడీలపై ప్రభుత్వాలకు పట్టింపు లేదన్నారు. ఈ సమావేశంలో జిల్లా కార్యవర్గ సభ్యులు ఆవుల అశోక్, డివిజన్ కార్యదర్శి ఝాన్సీ, నాయకులు సందీప్, రాకేష్, తేజ్యానాయక్, వెంకటేశ్వర్లు, సక్రు, లక్ష్మీనరసింహారావు, పాపారావు, శ్రీను పాల్గొన్నారు.

పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలి



మధిర: పారిశుద్ధ్య పనులను పరిశీలిస్తున్న మున్సిపల్ చైర్ పర్సన్ లత

మధిర: పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని మధిర మున్సిపల్ చైర్ పర్సన్ మొండితోక లత అన్నారు. మధిర మున్సిపాలిటీ పరిధిలోని 13వ వార్డులో జరిగిన కార్యక్రమంలో ఆమె పాల్గొని మాట్లాడారు. సీజనల్ వ్యాధులపై అప్రమత్తంగా ఉండాలని కోరారు. గృహాల్లో మురుగునీరు నిల్వ లేకుండా చూసుకోవాలన్నారు. కార్యక్రమంలో కమిషనర్ అంబటి రమాదేవి, కౌన్సిలర్ బిక్కీ అనిత తదితరులు పాల్గొన్నారు.

దెందుకూరు పీహెచ్‌సీ పరిధిలో..

మండలంలోని దెందుకూరు పీహెచ్‌సీ పరిధిలో డ్రైడే కార్యక్రమం నిర్వహించారు. పారా మెడికల్ సిబ్బంది ఇంటింటికీ తిరిగి దోమలు పుట్టకుండా, కుట్టకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలపై అవగాహన కల్పించారు. ఇంటి పరిసరాల్లో నిల్వ నీటిని తొలగించారు. ఈ కార్యక్రమంలో ఆరోగ్య సిబ్బంది పద్మావతి, గోవింద్, సుబ్బలక్ష్మి, కౌసల్య, లంకా కొండయ్య తదితరులు పాల్గొన్నారు.

మండలాల్లో ఫ్రైడే.. డ్రైడే

ఏన్కూరు/ముదిగొండ/సత్తుపల్లిరూరల్: ఏన్కూరుమండలంలోని తూతకలింగన్నపేటలో శుక్రవారం డ్రైడే కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంపీపీ ఆరెం వరలక్ష్మి ఇంటింటికీ తిరిగి పరిసరాలను పరిశీలించారు. అదే విధంగా మండలంలోని ముదిగొండ, వెంకటాపురం గ్రామాల్లో ఎంపీడీఓ అశోక్‌కుమార్ పర్యటించి పరిసరాలను పరిశీలించారు. గంగారం పీహెచ్‌సీ ఆధ్వర్యంలో సత్తుపల్లి మండలంలోని అన్ని గ్రామాలు, పట్టణంలోని అన్ని వార్డులలో పర్యటించి మురికి గుంతల్లో కిరోసిన్ బాల్స్ వేశారు. కార్యక్రమంలో ఎంపీడీఓ వేణుమాధవ్, పంచాయతీ కార్యదర్శి శివ, అంగన్‌వాడీలు, ఎంపీఓ సూర్యనారాయణ, పంచాయతీ కార్యదర్శులు సంపత్, నాయిని వెంకటేశ్వర్లు, పీహెచ్‌సీ వైద్యుడు అవినాష్, వైద్య సిబ్బంది, ఆశా వర్కర్లు పాల్గొన్నారు.

'ఆశ'ల సమ్మెను జయప్రదం చేయండి



వైరా: వైద్యాధికారి ఉదయశ్రీకి సమ్మె నోటీస్ అందజేస్తున్న ఆశ కార్యకర్తలు

వైరా/తల్లాడ: తమ న్యాయమైన డిమాండ్లను పరిష్కరించాలని కోరుతూ శుక్రవారం స్థానిక వైద్యాధికారి ఉదయశ్రీ, తల్లాడ తహసీల్దార్ రవికుమార్, మండల వైద్యాధికారి రత్నమనోహర్ లకు ఆశ వర్కర్లు సమ్మెనోటీస్ అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. గ్రామాల్లో అన్ని రకాల వైద్య సేవలు ప్రభుత్వ పథకాల ప్రచారం తదితర పనులతో పని చేస్తున్న ఆశ కార్యకర్తలను ప్రభుత్వం పట్టించుకోక పోగా.. ఇప్పుడు వారికిచ్చే పారితోషకాల విషయంలో ప్రభుత్వాస్పత్రుల్లో డెలివరీలను లింకులు పెట్టడం సరికాదన్నారు. కరోనా సమయంలో ఇచ్చిన రూ.16 వేలు స్పెషల్ అలవెన్స్ ఇప్పుడు కూడా ఇవ్వాలన్నారు. ఈ నెల 25 నుంచి చేపట్టే రాష్ట్ర వ్యాప్త సమ్మెకు ఆశవర్కర్లు అందరు పాల్గొని జయప్రదం చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో సీపీఎం మండల కార్యదర్శి బొనాల రామలింగేశ్వరరావు, సీఐటీయూ మండల కార్యదర్శి షేక్ మస్తాన్, ఆశ వర్కర్లు తాళ్ల రాణి, జ్యోతి, దేవకరుణ, శైలజ, ఆదిలక్ష్మి, రేణుక, మహేశ్వరి, కోటేశ్వరి, ప్రమీల పాల్గొన్నారు.

చెరువు సమస్యను పరిష్కరించండి



ఆర్డీఓ అశోక్‌చక్రవర్తికి వినతిపత్రం అందజేస్తున్న రైతులు

కల్లూరు: సంగారెడ్డి చెరువుకు చెరువు అలుగు, కట్టలు బలపరిచి పూర్వ వైభవం తీసుకురావాలని శుక్రవారం రైతులు ఆర్డీఓ అశోక్‌చక్రవర్తికి వినతిపత్రం అందించారు. చెరువు లోతట్టు 130 ఎకరాలకు మునక భూమిగా గుర్తించి.. అధికారులు 2016లో సర్వే చేసి రైతులకు భూమి పట్టాలు ఇవ్వొద్దని తేల్చారు. కానీ 8 ఎకరాలకు ఓ రైతుకు పట్టా చేయడంతో పొలం నీటిలో మునుగుతుదని చెరువు అలుగును పగులగొట్టాడు. కావున అతని పాసుపుస్తకాన్ని తొలగించి అలుగు నిర్మాణంతో పాటుగా చెరువు ముందు భాగంలో యూటీ నిర్మాణం చేపట్టాలన్నారు. ప్రస్తుతం యూటీలో రాళ్లబంజర్ రైతులు మోటార్లతో పొలాలకు నీరు పెట్టడంతో చెరువు ఆయకట్టుకు నీరు అందక ఇబ్బంది పడుతున్నామని, వెంటనే ఆ మోటార్లను తొలగించాలని ఆర్డీఓకు తెలిపారు. జలవనరులశాఖ ఈఈకి వినతిపత్రం అందజేశారు. తహసీల్దార్‌తో మాట్లాడి పట్టాదారు పాస్‌పుస్తకం ఎలా ఇచ్చారో తెలుసుకుని రద్దు చేసేందుకు చర్యలు తీసుకుంటానని హామీ ఇచ్చినట్లు రైతులు పేర్కొన్నారు. కార్యక్రమంలో గోపాలస్వామి, ప్రభాకర్‌రెడ్డి, నాగరాజు, గోపాలరావు, జాని, లాలయ్య, కృష్ణ, విశ్వనాథం, చందు, నాగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులు క్రీడల్లోనూ రాణించాలి



మేడేపల్లిలో కబడ్డీ ఆడుతున్న విద్యార్థినులు

ముదిగొండ: విద్యార్థులు చదువుతో పాటు క్రీడల్లోనూ రాణించాలని ఎస్సై నరేష్ అన్నారు. మండలంలోని మేడేపల్లి జిల్లాపరిషత్ ఉన్నత పాఠశాలలో బాలికల అండర్–14, 17 విభాగాల్లో కబడ్డీ, వాలీబాల్, ఖోఖో, అథ్లెటిక్స్ పోటీలు శుక్రవారం నిర్వహించారు. పోటీల్లో పాల్గొన్న క్రీడాకారులను ఎస్సై పరిచయం చేసుకున్నారు. క్రీడల్లో విద్యార్థినులు ఉత్సాహంగా పాల్గొన్నారు.

పోటీల్లో విద్యార్థుల ప్రతిభ..

వైరా: మండల స్థాయి పాఠశాల క్రీడా పోటీలలో వైరా శాంతినగర్‌లోని న్యూలిటిల్ ఫ్లవర్స్ పాఠశాల విద్యార్థులు ఉత్తమ ప్రతిభ కనబర్చినట్లు పాఠశాల కరస్పాండెంట్ డాక్టర్ పి.భూమేశ్వరరావు తెలిపారు. వైరా ప్రభుత్వ పాఠశాలలో నిర్వహించిన పోటీలలో అండర్–14,17 విభాగంలో ఖోఖో ప్రథమ, వాలీబాల్ ద్వితీయ స్థానం సాధించినట్లు తెలిపారు. పలువురు విద్యార్థులకు జోనల్ పోటీలకు అర్హత సాధించనట్లు తెలిపారు. ప్రతిభ కనబర్చిన విద్యార్థులను కరస్పాండెంట్ భూమేశ్వరరావు, డైరెక్టర్ సుమన్, ప్రిన్సిపల్ షాజీ మాథ్యు, ఏఓ నరసింహారావులు అభినందించారు.

పేస్కేల్ ఇవ్వాలి



బోనకల్: ఎంపీడీఓ శ్రీనివాసరావుకు వినతిపత్రం అందజేస్తున్న ఆపరేటర్లు

బోనకల్/ఎర్రుపాలెం: పంచాయతీ రాజ్ శాఖలో డిపార్ట్‌మెంట్‌లో కంప్యూటర్ ఆపరేటర్లుగా విధులు నిర్వర్తిస్తున్న తమను జూనియర్ అసిస్టెంట్లుగా గుర్తిస్తూ పేస్కేల్ ఇవ్వాలని కోరుతూ శుక్రవారం ఆపరేటర్లు ఎంపీడీఓ శ్రీనివాసరావుకి వినతిపత్రం అందజేశారు. ప్రభుత్వం స్పందించకపోతే సమ్మెకు వెళ్తామన్నారు. కార్యక్రమంలో ఆపరేటర్లు లక్ష్మి, తిరుపతిరావు, మహ్మద్ అలీ, నాగబాబు, పారా జ్యోజి రాణి, రాజు, వేమిరెడ్డి రాజేందర్‌రెడ్డి ఉన్నారు.

వినాయక మండపాల వద్ద అన్నదానం



అన్నదానం చేస్తున్న మల్లు నందిని

మధిర: మండలంలో ఏర్పాటు చేసిన వినాయకుడి శిబిరాల వద్ద సీఎల్పీ నేత మల్లు భట్టి విక్రమార్క సతీమణి నందిని విక్రమార్క శుక్రవారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆత్కూరు గ్రామంలో ఉత్సవ కమిటీ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన అన్నదాన కార్యక్రమాన్ని ఆమె ప్రారంభించారు. అదే విధంగా మధిర పట్టణం సుందరయ్య నగర్‌లో కొలువుదీరిన గణనాథునికి మున్సిపల్ కౌన్సిలర్లు మల్లాది వాసు, సవిత దంపతులు పూజలు చేశారు.

ఖాన్‌ఖాన్‌పేట కాల్వొడ్డులో..

కల్లూరు: కల్లూరు పంచాయతీ పరిధిలోని ఖాన్‌ఖాన్‌పేట కాల్వొడ్డు గణనాథుడి వద్ద నిర్వహించిన అన్నదాన కార్యక్ర మాన్ని రైతు సమితి మండల కన్వీనర్ డాక్టర్ లక్కినేని రఘు, సీఐ హనూక్, ఎస్సై పి.రఘులు ప్రారంభించి ప్రత్యేక పూజలు చేశారు. కార్యక్రమంలో నిర్వాహకులు మేడేపల్లి గణేష్, మాడపాటి సురేష్, పుచ్చకాయల సత్తిరెడ్డి, ఉప్పు వెంకట్, మాడపాటి జ్యోతి, మేడేపల్లి లక్ష్మి పాల్గొన్నారు.

చంద్యా తాండలో..

కల్లూరురూరల్: వినాయక చవితి ఉత్సవాలలో భాగంగా మండలంలోని చంద్యాతాండలో నిర్వహించిన అన్నదాన కార్యక్రమాన్ని కాంగ్రెస్ నాయకుడు కొండూరి సుధాకర్ ప్రారంభించారు. అనంతరం హనుమతాండలో కాంగ్రెస్ గ్యారెంటీ కార్డును గిరిజనులకు వివరించారు. కార్యక్రమంలో సర్పంచ్ మోహన్, కిరణ్, వెంకటేశ్వరావు, వైకుంఠశ్రీను, లోకేష్, కోటయ్య, శ్రీను, జనార్దన్ పాల్గొన్నారు.

అన్నారుగూడెం, నూతనకల్‌లో..

తల్లాడ: మండలంలోని అన్నారుగూడెం, నూతనకల్ గ్రామాల్లో శుక్రవారం అన్నదానం చేశారు. అన్నారుగూడెంలో సాయిబాబా దేవాలయ కమిటీ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన అన్నదాన కార్యక్రమాన్ని సర్పంచ్ మారెళ్ల మమత ప్రారంభించారు. నూతనకల్ రామాలయం వద్ద గణపతి ఉత్సవ కమిటీ ఆధ్వర్యంలో అన్నదాన కార్యక్రమాన్ని తల్లాడ ఎంపీపీ దొడ్డా శ్రీనివాసరావు ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో సత్తుపలి నియోజకవర్గ కాంగ్రెస్ నాయకురాలు మట్టా రాగమయి, నూతనకల్ గ్రామాల సర్పంచ్ తూము శ్రీనివాసరావు, నాయకులు, ఆలయ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.